# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

గురువారం 15 మే 2025 పేజీలు 8


## సరస్వతి పుష్కరాలకు సర్వం సిద్ధం..

## పుష్కర ఘాట్ ప్రారంభించనున్న సీఎం రేవంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** సరస్వతి పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు చేపట్టామని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజా రామయ్యర్ తెలిపారు. గురువారం (మే 15) నుంచి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుధవారం (మే 14) ఆమె సరస్వతి ఘాట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. 2025, మే15 నుంచి 26వ తేదీ వరకు జరిగే సరస్వతి పుష్కరాల సందర్భంగా వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఆమె తెలిపారు. గురువారం (మే 15) సీఎం రేవంత్ రెడ్డి

-2 లో

## మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి సుప్రీంకోర్టులో

# ఊరట.. షరతులు వర్తిస్తాయి!

- మొయినాబాద్ భూకబ్జా కేసులో సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్
- తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేసిన జీవన్ రెడ్డి
- దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని సుప్రీంకోర్టు షరతు



హైదరాబాద్ పెన్ పవర్:ఆర్మూర్ మాజీ శాసనసభ్యుడు జీవన్ రెడ్డికి సర్వోన్నత న్యాయస్థానంలో ఊరట లభించింది. మొయినాబాద్ ప్రాంతంలో ప్రైవేటు భూమిని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారన్న ఆరోపణలకు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఈ వ్యవహారంలో దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

-2 లో

# చెడగొట్టు వానలతో ఆశలు చెల్లాచెదురు

- ములుగు జిల్లాలో 1,300 బస్తాల ధాన్యం నీటిపాలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 600కిపైగా కల్లాల్లో వడ్లకు నష్టం
- మంచిర్యాల జిల్లా సారంగపల్లిలో తడిసిన 250 క్వింటాళ్ల ధాన్యం
- కొనుగోళ్లలో ఆలస్యమే కారణమని రైతుల ఆరోపణ





అకాల వర్షం మరోసారి అన్నదాతలకు కన్నీళ్లు మిగిల్చింది. ధాన్యం గింజలు కళ్లెదుటే వరద నీటిలో కొట్టుకుపోతుంటే వారు తల్లడిల్లారు. చెడగొట్టు వానలతో తమ ఆశలు గల్లంతయ్యాయని వాపోతున్నారు. ములుగు, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల జిల్లాల్లో మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లవారుజామున భారీ వానలు కురిశాయి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం గోగుపల్లిలో

-2 లో

## నేటి నుంచి సరస్వతి

# పుష్కరాలు

- వేకువ జామున 5.44 గంటలకు కాళేశ్వరంలో లాంఛనంగా ప్రారంభం
- సాయంత్రం పుష్కర స్నానాలు ఆచరించనున్న సీఎం దంపతులు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రంలోని త్రివేణి సంగమంలో గురువారం నుంచి సరస్వతి నది పుష్కరాలు ప్రారంభం కానున్నాయి. గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా సరస్వతి నది కలిసే ఈ త్రివేణి సంగమంలో ఈ నెల 26 వరకు ఈ మహాక్రతువు జరగనుంది. బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశంతో సరస్వతి నదికి పుష్కరాలు వస్తున్నాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకే బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కరకాలం ప్రారంభమవుతున్నా... గురువారం సూర్యోదయం నుంచి పుష్కర స్నానాలు ఆచరించాలని కాళేశ్వరం ఆలయ అర్చకులు వివరించారు. గురువారం వేకువజామున 5.44 గంటలకు సరస్వతి

-2 లో

# స్పీడ్ పెంచండి

### హైదరాబాద్‌లోని మిస్సైల్ తయారీ సంస్థలకు కేంద్రం ఆర్డర్..!




**హైదరాబాద్ పెన్ పవర్:** పహల్గాం టెర్రరిస్ట్ ఎటాక్, ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాక్ మధ్య పరిస్థితులు తారా స్థాయికి చేరుకున్నాయి. ఇరు దేశాలు డ్రోన్లు, మిస్సైళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఈ పరిణామాలతో పాక్, భారత్ మధ్య యుద్ధం

-2 లో

# చెడగొట్టు వానలతో ఆశలు చెల్లాచెదురు

- మొదటి పేజి తరువాయి

బుధవారం వేకువజామున 4 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు కురిసిన వర్షంతో ఊరవాగుకు వరద పోటెత్తింది. దాంతో సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం నీట మునిగింది. రవాణాకు సిద్ధంగా ఉన్న 600 బస్తాలతోపాటు ఆరబోసిన మరో 700 బస్తాల ధాన్యం ప్రవాహంలో కలిసిపోయింది. హమాలీలు, లారీల కొరత, కేంద్రం నిర్వాహకుల నిర్లక్ష్యంతోనే నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. యాభై మందికిపైగా అన్నదాతలకు రూ.30 లక్షల వరకు నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఐటీడీఏ పీవో చిత్రామిశ్ర సంఘటన స్థలాన్ని పరిశీలించారు. "మూడెకరాల్లో పండించిన పంటను 20 రోజుల కిందట కేంద్రానికి తీసుకొచ్చాం. తేమ పేరుతో ఆలస్యం చేశారు. లారీలు కూడా రావడం లేదన్నారు. చూస్తుండగానే పంటంతా నీటి పాలైంది. ఏం చేయాలో తోచడంలేదు" అని స్థానిక రైతు బండారి సుజాత రోదించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు నష్టం జరిగిందని ములుగు జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆరోపించారు. నీట మునిగిన కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లులకు పంపించాలని కోరారు.

**కల్లాల్లో ధాన్యం కదల్లేదు**

బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో కరీంనగర్ జిల్లా వీణవంక, శంకరపట్నం, జమ్మికుంట, మానకొండూర్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట, జగిత్యాల జిల్లా ధర్మపురి, పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరు వందలకుపైగా కల్లాల్లోని వడ్ల కుప్పలు తడిసిపోయాయి. కొన్నిచోట్ల తేమ కారణంతో కాంటా పెట్టకపోగా, ఇంకొన్నిచోట్ల హమాలీలు, బస్తాల కొరతతో సేకరణ ఆలస్యమవుతోందని రైతులు ఆరోపించారు.

**లారీల జాప్యంతో అపార నష్టం**

మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం సారంగపల్లి, పొన్నారం గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి భారీ వర్షం పడింది. కొనుగోలు కేంద్రాల్లోకి వాననీరు చేరి 250 క్వింటాళ్ల వరకు ధాన్యం తడిసింది. వడ్లను వేగంగా తూకం వేయకపోవడం, లారీల ద్వారా తరలించకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు.

**బాధిత రైతులను ఆదుకుంటాం: మంత్రి సీతక్క**

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం గోగుపల్లిలో నీట మునిగిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర మంత్రి సీతక్క పరిశీలించారు. బాధిత రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లోని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని భరోసా కల్పించారు.

## మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట.. షరతులు వర్తిస్తాయి!

- మొదటి పేజి తరువాయి

గతంలో ఇదే భూ వివాదానికి సంబంధించి జీవన్ రెడ్డి దాఖలు చేసుకున్న పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. దర్యాప్తు ప్రక్రియకు సంపూర్ణంగా సహకరించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ జీవన్ రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

సుప్రీంకోర్టులో ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా, జీవన్ రెడ్డి తరపున వాదనలు వినిపించిన న్యాయవాది, ఇదే కేసుకు సంబంధించి ఆయన కుటుంబ సభ్యులకు ఇప్పటికే బెయిల్ లభించిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇరుపక్షాల వాదనలు విన్న జస్టిస్ పార్థీవాలా నేతృత్వంలోని ధర్మాసనం, జీవన్ రెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని, విచారణ ప్రక్రియలో ఎటువంటి ఆటంకాలు కల్పించరాదని స్పష్టం చేసింది. ఒకవేళ దర్యాప్తునకు సహకరించని పక్షంలో, సంబంధిత విచారణాధికారులు చట్టప్రకారం తగిన చర్యలు తీసుకునేందుకు సుప్రీంకోర్టు వెసులుబాటు కల్పించింది.

## నేటి నుంచి సరస్వతి పుష్కరాలు

- మొదటి పేజి తరువాయి

ఘాట్ వద్ద శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. సరస్వతి నవరత్న మాల హారతి ప్రతిరోజూ సరస్వతి ఘాట్‌లో సాయంత్రం 6.45 నుంచి 7.35 గంటల వరకు సరస్వతి నవరత్న మాల హారతి ఉంటుంది. దీంతోపాటు కళా, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. భక్తులు రుసుము చెల్లించి బస చేసేందుకు వీలుగా తాత్కాలికంగా టెంట్ సిటీని నిర్మించారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఘాట్ల నిర్మాణం, రహదారి మరమ్మతులు, పార్కింగ్ తదితర ఏర్పాట్లన్నీ పూర్తిచేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసింది. ప్రతిరోజు సగటున లక్షన్నర మంది వస్తారని దేవాదాయశాఖ అంచనా వేసింది.

పుష్కరాల నేపథ్యంలో నదీ జలాలు కలుషితం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) అధికారుల్ని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. సరస్వతి నది పుష్కరాల పోస్టర్‌ను పీసీబీ అధికారులతో కలిసి బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ఆవిష్కరించారు.

**సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి**

గురువారం సాయంత్రం 4.30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు కాళేశ్వరం చేరుకోనున్నారు. పుష్కర స్నానం ఆచరించి, శ్రీకాళేశ్వర, ముక్తీశ్వర స్వామి వార్లను దర్శించుకుంటారు. అనంతరం సరస్వతి నదికి ఇచ్చే ప్రత్యేక హారతిలో పాల్గొంటారు. అక్కడే ఏర్పాటు చేసిన 10 అడుగుల సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. భక్తుల వసతి కోసం నిర్మించిన 86 గదుల సముదాయాన్ని ప్రారంభిస్తారు. కాళేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న పుష్కరాల్లో పాల్గొంటున్న తొలి సీఎం రేవంత్‌రెడ్డే కావడం విశేషం. గతంలో ఇక్కడ గోదావరి, ప్రాణహిత, సరస్వతి పుష్కరాలు నిర్వహించినా ఉమ్మడి, తెలంగాణ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రీ పాల్గొనలేదు.

### సరస్వతి పుష్కరాలకు సర్వం సిద్ధం..

## పుష్కర ఘాట్ ప్రారంభించనున్న సీఎం రేవంత్

- మొదటి పేజి తరువాయి

సరస్వతి మాతా విగ్రహం, ఘాట్ ప్రారంభోత్సవం చేస్తారని.. అనంతరం పుష్కర స్నానమాచరించి స్వామి వారిని దర్శించుకుంటారని చెప్పారు. అలాగే.. త్రివేణి సంగమంలో మొట్టమొదటి సారిగా కాశీ పండితులు నిర్వహించనున్న నదీ హారతిలో సీఎం పాల్గొంటారని పేర్కొన్నారు. తెలంగాణలో మొట్ట మొదటిసారిగా పెద్ద

ఎత్తున పుష్కరాలు నిర్వహిస్తున్నామని, జిల్లా యంత్రాంగం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, భక్తుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని.. అందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు.

## స్పీడ్ పెంచండి: హైదరాబాద్‌లోని మిసైల్ తయారీ సంస్థలకు కేంద్రం ఆర్డర్..!

- మొదటి పేజి తరువాయి

మొదలైనట్లేనని అనుకుంటుండగా రంగంలోకి దిగిన అమెరికా ఇరు దేశాలతో మాట్లాడి కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చింది. దీంతో యుద్ధ పరిస్థితులు సద్దుమణిగి.. సరిహద్దు దగ్గర ఇప్పుడిప్పుడే శాంతి వాతావరణం నెలకొంటుంది. అయితే.. కాల్పుల విరమణ కుదిరినప్పటికీ.. పాక్ వక్ర బుద్ధి తెలిసిన భారత్ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటుంది. భారత్?పై పీకల దాకా విషం నింపుకుని ఉండే పాక్.. ప్రపంచ దేశాల నుంచి ఎదురయ్యే ఒత్తిడి, భారత్ మెరుపు దాడులతో అతలాకుతలం కావడం వల్ల చేసేదేమి లేక సీజ్ ఫైర్?కు అంగీకరించింది. పాక్ ఏ నిమిషమైనా తన జిత్తులమారి బుద్ధి చూపించే అవకాశం ఉండటంతో భారత్ తన ఆయుధ సంపత్తిని మరింత పటిష్టం చేసుకోవడంపై దృష్టి సారించింది. ఈ క్రమంలోనే.. బ్రహ్మోస్, ఆకాశ్ వంటి క్షిపణుల తయారీదారులను ఉత్పత్తిని వేగవంతం చేయాలని భారత ప్రభుత్వం ఆదేశించింది. ముఖ్యంగా.. భారతదేశ క్షిపణి రాజధాని హైదరాబాద్‌లో ఉన్న రక్షణ ఆయుధాల తయారీదారులను దేశంలో క్షిపణ నిల్వలను పెంచడానికి ఉత్పత్తిని పెంచి డెలివరీలు స్పీడప్ చేయాలని కోరింది. హైదరాబాద్‌లో డీఆర్డీవో, భారత్ డైనమిక్స్ (BDL), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ), అదానీ ఎల్బిట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, కళ్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (KRAS), MTAR టెక్నాలజీస్, ఆస్ట్రా మైక్రోవేవ్, అనంత్ టెక్నాలజీస్, రఘు వంశీ, జెన్

టెక్నాలజీస్, %SEC% ఇండస్ట్రీస్ వంటి అనేక ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు ఉన్నాయి. పాక్?తో ఉద్రిక్తతల నేపథ్యంలో మిసైళ్ల తయారీ ఉత్పత్తిని పెంచి.. వేగంగా డెలివరీ చేయాలని కేంద్ర ఈ సంస్థలకు ప్రభుత్వం సూచించింది. పాక్ తో యుద్ధ వాతావరణం నెలకొనడంతో డెలివరీలను వేగవంతం చేయడానికి వీకెండ్?లో కూడా పని చేయమని కేంద్ర ప్రభుత్వం కోరిందని ఆకాష్, బ్రహ్మోస్ మిసైళ్ల పరికరాలు తయారు చేసే హైదరాబాద్ కంపెనీ ప్రమోటర్ వెల్లడించారు. కాగా, 2019 ఫిబ్రవరిలో బాలాకోట్ వైమానిక దాడిలో ఉపయోగించిన స్పైస్ 2000 క్షిపణులను హైదరాబాద్‌లోని కల్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (KRAS)లో తయారు చేసిన విషయం తెలిసిందే.

## అభయారణ్యంలో పులుల ఫైట్.. బ్రహ్మ పులిని చంపిన చోటామాట్కా టైగర్.. గతంలో కూడా రెండింటిని చంపేసింది



**హైదరాబాద్ పెన్ పవర్:**మనుషుల్లాగే జంతువులకు కూడా ప్రాదేశిక సరిహద్దులు ఉంటాయి. అంటే టెరిటోరియల్ బౌండరీస్. ఒక జంతువుకు సంబంధించిన బౌండరీ మరోటి దాటితే వాటి మధ్య ఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఇది పులులు, సింహాలు లాంటి క్రూర జంతువుల విషయంలో కాస్త క్రుయెల్ గా ఉంటుంది. అభయారణ్యంలో రెండు పులల మధ్య జరిగిన టెరిటోరియల్ ఫైట్ లో బ్రహ్మ పులిని చంపేసింది చోటామాట్కా టైగర్. ఈ పులి గతంలో కూడా రెండు పులలను చంపేసింది. మహారాష్ట్ర చంద్రపూర్ తడోబా టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో మంగళవారం పులుల మధ్య భీకర యుద్ధం జరిగింది. రాందేగి అటవీ ప్రాంతంలో చోటా మాట్కా , బ్రహ్మ పులుల మధ్య జరిగిన ఫైటింగ్ లో బ్రహ్మ పులి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘర్షణలో చోటా మాట్కా పులి తీవ్రంగా గాయపడింది. చోటామాట్కా పులి ఏర్పాటు చేసుకున్న టెరిటోరియల్ లోకి వేరొక పులి వస్తే సహించేది కాదని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. గతంలో కూడా తన ప్రాదేశిక ప్రాంతంలోకి వచ్చిన భజరంగ్, మోగ్లి అనే రెండు పులులను చంపేసిందని తెలిపారు. ఇటీవల బ్రహ్మపులి అడుగుపెట్టడంతో చోటామాట్కా పులి తీవ్రంగా దాడికి దిగిందని.. రెండు పులల మధ్య గంటల తరబడి జరిగిన ఘర్షణలో బ్రహ్మ పులి చనిపోయిందని తెలిపారు అధికారులు. రెండు పులల మధ్య జరిగిన భీకర యుద్ధాన్ని పర్యాటకులు భయాందోళనకు గురయ్యారు.

## బాలాపూర్‌లో దారుణం.. అనుమానంతో భార్యను చంపేసి భర్త పరార్..



**హైదరాబాద్ పెన్ పవర్:** ముచ్చటగా మూడు పదుల వయసులో.. ముగ్గురు పిల్లల సంతానంతో.. సంతోషంగా సాగాల్సిన ఓ వివాహిత జీవితం అర్ధంతరంగా ముగిసిపోయింది. కట్టుకున్న భర్తే భార్యను కడతేర్చడం బాలాపూర్ లో విషాదాన్ని నింపింది. అనుమానంతో భార్యను చంపేసి భర్త పరారైన ఘటన హైదరాబాద్ బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. నగర శివారు ప్రాంతం లోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో న్యూ గ్రీన్ సిటీ లో జాకీర్ అహ్మద్ (31), నజియా భేగం (30) నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు సంతానం. గతంలో గోల్కొండ ప్రాంతం లో ఉండేవారని.. ఇటీవలే బాలాపూర్ కు మారినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. లోకల్ గా ఉండే సిరాజ్ అనే ఇండ్ల బ్రోకర్ జాకీర్ కుటుంబానికి అద్దె ఇల్లు ఇప్పించినట్లు చెప్పారు.

గత కొద్ది రోజులుగా నజియాకు అక్రమ సంబంధం ఉందని భార్య పై అనుమానం పెంచుకున్నాడు జాకీర్ . మంగళవారం (మే 13) రాత్రి ఈ అంశంపై ఇద్దరి మధ్య జరిగిన గొడవలో.. భార్యను కట్టెతో కొట్టి, గొంతు నులిమి.. గాజు పెంకుతో కోసినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయని పోలీసులు తెలిపారు. మంగళవారం (మే 13) రాత్రి హత్య చేసి ఉదయం (బుధవారం) అత్త రుబీనాకు చెప్పి పారిపోయాడు జాకీర్. మృతురాలి తల్లి రుబీన కంప్లైంట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నజియా బేగం ఈవెంట్ లలో పని చేస్తున్నట్లు తెలిసింది.

# ఇండియన్ టూరిస్టులు టర్కీని బహిష్కరించాలి..బిలియనీర్ హర్ష్ గోయెంకా



**హైదరాబాద్ పెన్ పవర్:**పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత బిలియనీర్ హర్ష్ గోయెంకా పాకిస్తాన్‌కు మద్దతిస్తున్న టర్కీ,అజర్‌బైజాన్‌లకు ప్రయాణాన్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఇండియన్ టూరిస్టుల ద్వారా టర్కీకి భారీ ఆదాయం వస్తుంది.. తద్వారా వారి ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని హైలైట్ చేశారు. ఇక్సిగో, ఈజీ మైట్రిప్ సహా అనేక భారతీయ ట్రావెల్ కంపెనీలు భారత్ కు మద్దతుగా బుకింగ్ లను నిలిపివేశాయన్నారు. పహల్గాం దాడి తర్వాత భారత్ పై దాడి చేసేందుకు పాకిస్తాన్ కు సాయమందించిన టర్కీ, అజర్ బైజాన్ లకు ప్రయాణాలు రద్దు చేసుకోవాలని బిలియనీర్ హార్ష్ గోయెంకా భారత పౌరులను కోరారు. సోషల్ మీడియా ప్లాట్ ఫాం %శ% ద్వారా ఓ పోస్ట్ ను షేర్ చేశారు. 2024లో రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఇండియన్ టూరిస్టులు దాదాపు 4వేల కోట్లకు పై అందించారని చెప్పారు. మన శత్రువులకు మద్దతిచ్చే ఆ దేశాల ఆర్థిక వ్యవస్థలకు సపోర్టు చేయకుండా భారత్ ప్రయాణికులు తమ శక్తిని ప్రదర్శించాల్సిన సమయం వచ్చిందని గోయెంకా అన్నారు.

గతేడాది పర్యాటకం ద్వారా టర్కీ, అజర్ బైజాన్ కు 4వేల కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. దీంతోపాటు అక్కడి ప్రజలకు ఉద్యోగాలు, హోటళ్లు, విమానాలు వంటివి గణనీయంగా పెంచుకున్నారు. ఇప్పుడు పహల్గాం దాడి తర్వాత రెండు దేశాలు పాకిస్తాన్ తో నిలబడ్డారని విమర్శించారు. భారత్ తోపాటు ప్రపంచంలో అనేక అందమైన ప్రదేశాలున్నాయి. దయచేసి ఈ రెండు ప్రదేశాలకు వెళ్లొద్దంటూ గోయెంకా %శ% లో పోస్ట్ చేశారు. భారత్,పాక్ మధ్య ఉద్రిక్తతల క్రమంలో టర్కీ, పాకిస్తాన్ కు సాయం చేసిందని ఇప్పటివరకు అనుమానాలు మాత్రమే ఉండేది.. ఇప్పుడు సాక్ష్యాలుగా కూడా దొరికాయి. ఆపరేషన్ సిందూర్ లో ఇద్దరు టర్కిష్ సైనికులు చనిపోయారు. భారత్ పై దాడికి పాకిస్తాన్ కు 350 కి పైగా డ్రోన్లను అందించిందని, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ పై డ్రోన్ దాడులు చేసేందుకు పాకిస్తాన్ ఆర్మీ అధికారులకు టర్కీ సలహాదారులు సహాయం చేశారని నిఘా వర్గాలు చెబుతున్నాయి. భారత్ పై బేరక్తర్ TB2, YIHA డ్రోన్లు పాకిస్తాన్ ఉపయోగించినట్లు తెలుస్తోంది. భారత సైనిక స్థావరాలను, కాన్వాయ్ లను బెదిరించేందుకు, కామికేజ్ దాడులకు ఈ డ్రోన్లను వినియోగించినట్లు సమాచారం.

పాకిస్తాన్ తో టర్కీ గత కొన్నేళ్లుగా వ్యూహాత్మక రక్షణ సంబంధాలను కొనసాగిస్తోంది. ఇటీవలి కాలంలో అవి బాగా బలపడ్డాయి. టర్కీ ప్రభుత్వం కీలకమైన సైనిక హార్డ్‌వేర్‌ను సరఫరా చేయడమే కాకుండా పాకిస్తాన్ సైన్యానికి శిక్షణ కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే పాకిస్తాన్ భారత్ పై డ్రోన్ దాడికి టర్కీ సహకరించిందని ఆందోళనలు చెలరేగాయి. దేశవ్యాప్తంగా టర్కీని బహిష్కరించాలి అని ఉద్యమం సాగింది. టర్కీ చర్యలు భారత ప్రయోజనాలను దెబ్బతీస్తుందని వాదనలు వినిపించాయి.

# భారత్ పై దాడికి టర్కీ ఆయుధాలిచ్చింది..ఇవిగో సాక్ష్యాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**భారత్,పాక్ మధ్య ఉద్రిక్తతల క్రమంలో టర్కీ, పాకిస్తాన్ కు సాయం చేసిందని ఇప్పటివరకు అనుమానాలు మాత్రమే ఉండేది..ఇప్పుడు సాక్ష్యాలుగా కూడా దొరికాయి. ఓపక్క ఉగ్రవాదులే లక్ష్యంగా భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహిస్తుంటే..మరో పక్క పాకిస్తాన్ కు టర్కీ ఆయుధాలు అందించి భారత్ పై దాడి చేసేందుకు సహకరించిందనడానికి కూలిన టర్కీ డ్రోన్లే నిదర్శనం..అంతేకాదు టర్కీ సైనిక సహకారం అందించింది అనడానికి ఆపరేషన్ సిందూర్?లో మృతిచెందిన ఇద్దరు టర్కిష్ కార్యకర్తలేసాక్ష్యం.

ఆపరేషన్ సిందూర్ లో ఇద్దరు టర్కిష్ సైనికులు చనిపోయారు. భారత్ పై దాడికి పాకిస్తాన్ కు 350 కి పైగా డ్రోన్లను అందించిందని, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ పై డ్రోన్ దాడులు చేసేందుకు పాకిస్తాన్ ఆర్మీ అధికారులకు టర్కీ సలహాదారులు సహాయం చేశారని నిఘా వర్గాలు చెబుతున్నాయి. భారత్ పై బేరక్తర్ %uదీ2, ¯×నూ% డ్రోన్లు పాకిస్తాన్ ఉపయోగించినట్లు తెలుస్తోంది. భారత సైనిక స్థావరాలను, కాన్వాయ్ లను బెదిరించేందుకు, కామికేజ్ దాడులకు ఈ డ్రోన్లను వినియోగించినట్లు సమాచారం. పాకిస్తాన్ తో టర్కీ గత కొన్నేళ్లుగా వ్యూహాత్మక రక్షణ సంబంధాలను కొనసాగిస్తోంది. ఇటీవలి కాలంలో అవి బాగా బలపడ్డాయి. టర్కీ ప్రభుత్వం కీలకమైన సైనిక హార్డ్‌వేర్‌ను సరఫరా చేయడమే కాకుండా పాకిస్తాన్ సైన్యానికి శిక్షణ కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే పాకిస్తాన్ భారత్ పై డ్రోన్ దాడికి టర్కీ సహకరించిందని ఆందోళనలు చెలరేగాయి. దేశవ్యాప్తంగా టర్కీని బహిష్కరించాలి అని ఉద్యమం సాగింది. టర్కీ చర్యలు భారత ప్రయోజనాలను దెబ్బతీస్తుందని వాదనలు వినిపించాయి.

**భారత్ నుంచి సాయం పొంది..**

కోవిడ్-19 తర్వాత టర్కీకి భారత ఎగుమతులను పెంచింది. టర్కీ తన రక్షణ ఉత్పత్తికి సాయం చేసింది. అల్యూమినియం, ఆటో భాగాలు, విమానాలు, టెలికాం పరికరాలు ,విద్యుత్ యంత్రాలు ,పరికరాలతో సహా టర్కీకి ఎగుమతి చేసింది.. అయితే అదే భారత్ పై దాడికి వినియోగించారని వార్తలు వినిపిస్తున్నాయి. వేగవంతమైన డ్రోన్ ఉత్పత్తి వెనుక ఉన్నాయని ఈ ఎగుమతులు ఉన్నట్లు తెలుస్తోంది.

మే7,8 తేదీల మధ్య రాత్రి సమయాల్లో పాకిస్తాన్ సైన్యం ఉత్తర ,పశ్చిమ సరిహద్దులలోని భారత సైనిక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా దాడులు చేసింది. ఈ దాడులకు 300%-%400 డ్రోన్లను వినియోగించింది. వీటిని టర్కీ సాయం చేసినట్లుగా వ్యక్తమయిన అనుమానాలు కల్నల్ సోఫియా ఖురేషి మాటలతో నిజమే అనిపిస్తోంది.“డ్రోన్ల శిథిలాల గురించి ఫోరెన్సిక్ దర్యాప్తు జరుగుతోంది. ప్రైమరీ రిపోర్టులు అవి టర్కిష్ అసిస్‌గార్డ్ సోంగర్ డ్రోన్లు అని చెబుతున్నాయని” అని కల్నల్ సోఫియా ఖురేషి ఆపరేషన్ సిందూర్ గురించి విలేకరుల సమావేశంలో చెప్పారు.

# అప్రమత్తంగా ఉండండి.. అధిక సేవలు అందించండి



**హైదరాబాద్ పెన్ పవర్:**సరస్వతి పుష్కర విధులు కేటాయయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఈ 12 రోజులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కాళేశ్వరం దేవస్థానంలోని కళ్యాణ మండపంలో విధులు కేటాయించిన వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి కేటాయించిన విధుల పట్ల దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో పెద్ద ఎత్తున సరస్వతి పుష్కరాలు జరుపుతున్నామని, అందుకు తగినట్లుగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతిరోజు లక్షకిపైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రం ఆసాంతం అప్రమత్తంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ప్రతి అధికారికి కేటాయించిన లొకేషన్స్ లో ముందస్తుగా పర్యటించి ఏర్పాట్లు పరిశీలన చేయాలని తెలిపారు. గైర్హాజరైన అధికారులకు, సిబ్బందికి ఆయా శాఖలకు తగు చర్యలు నిమిత్తం సిఫారసు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 15వ తేదీ ఉదయం పుష్కరాలు ప్రారంభమవుతాయని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పుష్కరాలను ప్రారంభించనున్నారని తెలిపారు. 15వ తేదీ సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి సరస్వతి మాత విగ్రహం ఆవిష్కరణ, పుష్కర స్నానం తదుపరి స్వామి వారి దర్శనం, గోదావరి హారతి కార్యక్రమాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారని అనంతరం టెంట్ సిటీ పరిశీలిస్తారని తెలిపారు. కాశీ పండితులతో ప్రత్యేకంగా హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12 సంవత్సరాలకు ఒకసారి జరుగుతున్న ఈ పుష్కరాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని అన్నారు. కుంభమేళా వెళ్లలేని వారు ఇక్కడికి వచ్చే అవకాశం ఉందని ఆ ప్రకారం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ 12 రోజుల విధులు చాలా ముఖ్యమని ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమన్వయంతో పని చేయాలని సూచించారు. సరస్వతి ఘాట్ మెయిన్ ఘాట్ వద్ద భక్తులు పుష్కర స్నానాలు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. భక్తులకు స్నానాల షవర్లు, బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పిండ ప్రధాన కార్యక్రమాలు చేసేందుకు కూడా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. స్టాళ్లు, టెంట్ సిటీ, డార్మెటరీ, ఫుడ్ కోర్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులు తు.చ తప్పక విఐపి ప్రోటోకాల్ పాటించాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని కంట్రోల్ రూమ్ కి వచ్చిన సమస్యను తక్షణమే ఆయా శాఖల అధికారులు దృష్టి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాలయంలో భక్తులు క్యూలైన్ పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 50 మంది గజ ఈతగాళ్ళు నాటు పడవలతో పహారా కాస్తున్నట్లు తెలిపారు. విధులు నిర్వహించే అధికారులు సిబ్బందిని పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తాత్కాలిక బస్టాండ్ నుంచి ఘాట్స్ వరకు భక్తుల సౌకర్యార్థం ఉచితంగా 30 షటిల్ బస్సులు నడుపుతున్నామని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుష్కరవిధులు కేటాయించిన అధికారులకు రెండు షిఫ్టుల్లో విధులు కేటాయించామని అప్రమత్తంగా ఉండాలని, సమయానికి విధులకు హాజరు కావాలని తెలిపారు. ఎవరైనా గైర్హాజరు అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధులు కేటాయించిన సిబ్బందికి భోజన, వసతి ఏర్పాటు చేస్తున్నామని సమయ పాలన పాటించాలని సూచించారు. స్విమ్మర్లు లైఫ్ బాయ్స్, జాకెట్స్ ధరించాలని గోదావరిలో ఏ ఒక్కరు మిస్ అయిన విధులకు ఇబ్బంది కలుగుతుందని అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో దేవాదాయశాఖ డైరెక్టర్ వెంకటరావు, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓ రవి అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# 48'వర్జిన్ బాయ్స్ టీజర్ ': యూత్‌ఫుల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్!

**హైదరాబాద్ పెన్ పవర్:**'వర్జిన్ బాయ్స్' టీజర్ రిలీజై, యూత్‌లో హాట్ టాపిక్‌గా మారింది!

గీతానంద్, మిత్రా శర్మ హీరో హీరోయిన్లుగా, శ్రీహాన్, రోనీత్, జెన్నిఫర్, అన్షుల, సుజిత్ కుమార్, అభిలాష్‌లతో రూపొందిన ఈ రొమాంటిక్ కామెడీ, దయానంద్ దర్శకత్వంలో రాజా దరపునేని నిర్మాణంలో రాజ్‌గురు ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కింది.

తాజాగా విడుదల అయిన టీజర్‌లో యూత్‌ఫుల్ వైబ్స్, కలర్‌ఫుల్ విజువల్స్ ఆకట్టుకుంటు న్నాయి.స్మరణ్ సాయి సంగీతం టీజర్‌కు జోష్‌ని జోడించగా, వెంకట ప్రసాద్ సినిమాటోగ్రఫీ ఫ్రెష్‌గా, ఎనర్జిటిక్‌గా కనిపిస్తోంది. మార్తాండ్ కె వెంకటేష్ ఎడిటింగ్ టీజర్‌ను క్రిస్పీగా మలిచింది. టీజర్‌లో గీతానంద్, మిత్రా శర్మ కెమిస్ట్రీ ఆకట్టుకుంటుంది. హాస్యం, రొమాన్స్, ఎమోషన్స్‌తో కూడిన ఈ కథ, ఆధునిక రిలేషన్‌షిప్స్‌ను తమదైన స్టైల్‌లో చూపించనుందని తెలుస్తోంది. బిగ్ బాస్ ఫేమ్ శ్రీహన్ క్యారెక్టర్ & కామెడీ టైమింగ్ కి రెస్పాన్స్ బాగా వస్తుంది. చిత్రంలో శ్రీహన్ నుండి మరింత కామెడీని ఆశించవచ్చు అనిపిస్తుంది. టీజర్‌లోని డైలాగ్స్, సీన్స్ ఫన్ ఎలిమెంట్స్‌ను హైలైట్ చేస్తున్నాయి. ఈ సమ్మర్‌లో 'వర్జిన్ బాయ్స్' యూత్‌ను థియేటర్స్‌కు రప్పించే ఫుల్ ఎంటర్‌టైనర్‌గా కనిపిస్తోంది. ఈ సినిమా కచ్చితంగా యూత్ కి బాగా కనెక్ట్ అవుతుందని మేకర్స్ భావిస్తున్నారు.నిర్మాత రాజా దరపునేని మాట్లాడుతూ.. "ఈ సినిమా యూత్ కి కనెక్ట్ అయ్యేలా తీర్చిదిద్దాం అన్నారు. గతంలో ఎన్నో మంచి యూత్ ఫుల్ ఎంటర్టైనర్ లు వచ్చాయి. కానీ వాటిని మైమరిపించేలా ఈ సినిమా ఉంటుందని అన్నారు. రొటీన్ కి భిన్నంగా ఈ సినిమా ఉంటుందన్నారు.ఈ సినిమా కచ్చితంగా యూత్ కి బాగా కనెక్ట్ అవుతుందని భావిస్తున్నాను" అన్నారు.ఆర్టిస్టులు : గీతానంద్, మిత్రా శర్మ, శ్రీహన్, రోనీత్, జెన్నీఫర్, అన్షుల, సుజిత్ కుమార్, బబ్లు, అభిలాష్

# ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఏలూరు జిల్లా పోలవరం ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం చోటుచేసుకుంది.కుంకాల గ్రామానికి చెందిన గిరిజన మహిళ శిరీష ప్రసవం కోసం ఆసుపత్రిలో చేరింది. కొంతసేపటికే మహిళ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నర్సులు చికిత్స అందించడంతోనే శిరీష మృతి చెందిందని ఆమె భర్త ఆరోపిస్తున్నాడు. శిరీష మృతదేహంతో ఆసుపత్రి బయట ఘోరంగా విలపిస్తున్నాడు. దీనికి సంబంధించిన వీడియో నెటిజన్లను కంటతడి పెట్టిస్తోంది.

## శ్రీ శివరామ నంద సరస్వతి స్వామిని కలిసిన బద్వేలు సర్పంచులు మున్సిపల్ కౌన్సిలర్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీ శ్రీ శ్రీ శివరామానంద సరస్వతి స్వామి ( బద్వేల్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ శివరామకృష్ణ రావు ) వారిని బద్వేల్ మండలము బద్వేల్ మున్సిపాలిటీకి చెందిన సర్పంచులు, మాజీ సర్పంచులు, బద్వేల్ మండల ఉపాధ్యక్షులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డ్ ఇన్చార్జులు, తదితరులు బుధవారం పోరుమామిళ్ళ వారి నివాసం నందు మర్యాదపూర్వకముగా కలిసి స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం జరిగినది. ఈ సందర్భముగా బద్వేల్ నియోజకవర్గ రాజకీయ స్థితిగతుల గురించి కూడా స్వామివారికి వివరించడం జరిగినదిlశ్రీ శ్రీ శ్రీ శివరామానంద సరస్వతి స్వామి వారిని బద్వేల్ మండలము మరియు బద్వేల్ మున్సిపాలిటీకి చెందిన సర్పంచులు, మాజీ సర్పంచులు, బద్వేల్ మండల ఉపాధ్యక్షులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డ్ ఇన్చార్జులు, తదితరులు పోరుమామిళ్ళ వారి నివాసం నందు మర్యాదపూర్వకముగా కలిసి స్వామివారి ఆశీస్సులు తీసుకోవడం జరిగినది. ఈ సందర్భముగా బద్వేల్ నియోజకవర్గ రాజకీయ స్థితిగతుల గురించి కూడా స్వామివారికి వివరించడం జరిగినది

## ఘనంగా సూర్య కళామందిరం నందు అన్నమయ్యచారులు 617వ జయంతోత్సవాలు...

**హైదరాబాద్ పెన్ పవర్:**కాకినాడ సినిమా రోడ్డు సరస్వతీ గానసభ సూర్య కళామందిర్ నందు పొన్నాడ వెంకట కామేశ్వరమ్మ శ్రీఅన్నమయ్య వెల్ఫేర్ సొసైటీ వారి సౌజన్యంతో పొన్నాడ శ్రీనివాస్ నేతృత్వంలో సోమవారం మే 12వ తేదీన సాయంత్రం 6:30 కి వాగ్గేయకారుడు శ్రీ అన్నమయ్య చారులు 617వ జయంతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్వరభారతి సంగీత సరస్వతి గాన కళానిధి పెద్దాడ సూర్య కుమారి వారి బృందం చే అన్నమయ్య కీర్తనాలు నిర్వహించినారు. ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం కృష్ణవేణి లోకేష్ బృందం చే నృత్య కార్యక్రమం జరిపించి, కాకినాడ గాంధీనగర్ పార్క్ స్వరఅభిషేకం పీవీవీ వీరభద్రరావు బృందం చే మ్యూజికల్ నైట్ ఘనంగా నిర్వహించారు.

## పెద్దిరెడ్డికి తప్పని తిప్పలు

**హైదరాబాద్ పెన్ పవర్:**వైసీపీ సీనియర్ నేత, మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం భూముల వ్యవహారంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కీలక ఆదేశాలు ఇచ్చారు. అటవీ, ప్రభుత్వ, బుగ్గ మఠం భూముల ఆక్రమణ వ్యవహారంలో మాజీమంత్రి పెద్దిరెడ్డి కుటుంబసభ్యులపై కేసులు నమోదు చేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. అలాగే ఈ భూములను రక్షించలేని అధికారులపైనా చర్యలు తీసుకోవాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పవన్ కల్యాణ్ ఆదేశాలిచ్చారు. భూముల ఆక్రమణలపై విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డీజీ ఇచ్చిన నివేదికను పవన్ కల్యాణ్ పరిశీలించారు. డీజీ సిఫార్సులకు అనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. చిత్తూరు జిల్లాలో అటవీ, ప్రభుత్వ, బుగ్గ మఠం భూముల ఆక్రమణలపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ డీజీ విచారణ జరిపి పవన్ కల్యాణ్ కు నివేదిక ఇచ్చారు. పెద్దిరెడ్డి భూముల వ్యహారంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ నివేదికను పవన్ పరిశీలించారు. అటవీ భూముల ఆక్రమణలకు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. పెద్దిరెడ్డి కుటుంబం అటవీ భూములు ఆక్రమించినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ప్రభుత్వం చేపట్టిన విచారణలోనూ ఇదే తేలిందని సమాచారం. ఈ వ్యవహారంలో పెద్దిరెడ్డి కుటుంబీకులపై ప్రభుత్వం క్రిమినల్ చర్యలు తీసుకునే ఛాన్స్ ఉంది. అదే సమయంలో భూములు ఆక్రమణలకు గురవుతుంటే రక్షించ లేని వారిని బాధ్యులను చేయనున్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోనుంది ప్రభుత్వం. అదే విధంగా ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నివేదికలో సిఫార్సు చేశారు. దాంతో పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులపై క్రిమినల్ కేసులు నమోదయ్యే ఛాన్స్ ఉంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం చిత్తూరు జిల్లాలో అటవీ, ప్రభుత్వ, బుగ్గ మఠం భూముల ఆక్రమించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సిందిగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌ను ప్రభుత్వం ఆదేశించింది. విచారణ జరిపిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ.. మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు నివేదిక అందజేశారు.

## స్వతంత్రదేశంగా ప్రకటించుకున్న బెలూచిస్తాన్

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం అమెరికా జోక్యంతో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకుంది. పాక్ పై భారత్ మెరుపు దాడులతో దాయాది దేశానికి చావు తప్పి కన్నులొట్టపొయినట్లు అయింది. దీని నుంచి తేరుకునే లోపు పాకిస్తాన్‌కు మరో బిగ్ షాక్ తగలింది. కొంతకాలంగా తమను ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేయాలని పాక్ పై పోరాటం చేస్తున్న బలూచ్ లిబరేషన్ ఆర్మీ.. స్వతంత్ర దేశంగా ప్రకటించుకుంది. అయితే, బలూచిస్తాన్, పాకిస్తాన్‌లోని పశ్చిమ ప్రాంతంలో ఉన్న ఒక ప్రావిన్స్, దీర్ఘకాలంగా స్వాతంత్ర్య ఉద్యమాలకు కేంద్రంగా కొనసాగుతుంది. కాగా, తమ సహజ వనరుల దోపిడీ, రాజకీయ హక్కుల ఉల్లంఘన, పాక్ సైన్యం చేస్తున్న అణచివేతలపై బలూచ్ ప్రజలు ఆందోళన చేస్తున్నారు. తమ హక్కుల కోసం బలూచ్ లిబరేషన్ ఆర్మీ ఈ ఉద్యమంలో ప్రముఖ సాయుధ సంస్థగా కొనసాగుతుంది. ఇది పాకిస్తాన్ సైన్యంతో పాటు మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తూ స్వతంత్ర బలూచిస్తాన్ కోసం పోరాటం చేస్తుంది. ఈ క్రమంలోనే ఈరోజు స్వతంత్ర దేశంగా అవతరించినట్లు ప్రకటించుకుంది. అలాగే, నూతన ప్రభుత్వ ఏర్పాటుకు తాము కసరత్తు చేస్తున్నామని క్వెట్టాలో కొత్త పార్లమెంట్ కు ఫోటోలు, జాతీయ చిహ్నం, జాతీయ గీతానికి సంబంధించిన వీడియోలను బలూచిస్తాన్ రిలీజ్ చేసింది. అలాగే, భారత్ సహా ఇతర దేశాలు తమ కొత్త బలూచిస్తాన్ దేశానికి వచ్చి ఎంబసీలను ఏర్పాటు చేయాలని కోరింది.

# వైసీపీకి షాక్ మీద షాక్

**హైదరాబాద్ పెన్ పవర్:**
వైసీపీకి బుధవారం వరుస షాకులు తగిలాయి. బుధవారం ఉదయం శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానం వైసీపీ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేశారు. అనంతరం ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరారు జకియా ఖానం. ఇక చీరాల మున్సిపల్ ఛైర్మన్ పదవిని కూడా వైసీపీ కోల్పోయింది. చీరాల మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అయితే అంతకుముందే ఆయన మున్సిపల్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. మరోవైపు జంజనం శ్రీనివాసరావు ఇప్పటికే టీడీపీలో చేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బుధవారం వరుస షాకులు తగిలింది. 2024 ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం.. చాలా మంది నేతలు వైసీపీకి రాజీనామా చేశారు. విజయసాయిరెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను, అవంతి శ్రీనివాస్ వంటి నేతలతో పాటుగా.. ద్వితీయ శ్రేణి నేతలు సైతం వైసీపీకి గుడ్‌బై చెప్పారు. వీరిలో కొంతమంది కూటమి పార్టీల్లో చేరగా.. మరికొంతమంది క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు. స్థానిక సంస్థల్లో వైసీపీ నుంచి గెలిచిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు కూడా చాలా మంది వైసీపీని వీడారు. టీడీపీ, జనసేన పార్టీల్లో చేరటంతో గుంటూరు, విశాఖపట్నం వంటి మేయర్ పదవులను, చాలా చోట్ల మున్సిపాలిటీ ఛైర్మన్ పదవులను కూటమి పార్టీలు కైవసం చేసుకున్నాయి. ఇక ఆరుగురు ఎమ్మెల్సీలు కూడా వైసీపీకి రాజీనామా చేశారు. ఇప్పటికే ఐదుగురు ఎమ్మెల్సీ తమ పదవులకు రాజీనామా చేయగా.. బుధవారం ఏపీ శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానం కూడా వైసీపీకి రాజీనామా చేశారు. వైసీపీ సభ్యత్వంతో పాటుగా ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేస్తూ జకియా ఖానం మండలి ఛైర్మన్‌కు లేఖ రాశారు. జకియా ఖానం 2020 జులైలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. గవర్నర్ కోటాలో ఆమె ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అనంతరం జకియా ఖానం బీజేపీలో చేరారు. అయితే జకియా ఖానం రాజీనామా మరువక ముందే మరో నేత వైసీపీకీ, మున్సిపల్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బాపట్ల జిల్లా చీరాల మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు మున్సిపల్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. జంజనం శ్రీనివాసరావు ఇప్పటికే వైసీపీని వీడి టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. అయిత శ్రీనివాసరావుపై అవిశ్వాస తీర్మానం పెట్టడంతో జంజనం శ్రీనివాసరావు మున్సిపల్ ఛైర్మన్ పదవికి ముందుగానే రాజీనామా చేశారు. అవిశ్వాస తీర్మానానికి హాజరవ్వడానికి ముందు చీరాల మున్సిపల్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు జంజనం శ్రీనివాసరావు ప్రకటించారు. అనంతరం చీరాల మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాసరావుపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. టీడీపీ కౌన్సిలర్లకు మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గం కౌన్సిలర్లు మద్దతు తెలపడంతో బుధవారం పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది అవిశ్వాసానికి అనుకూలంగా 26 ఓట్లు పడ్డాయి. మరోవైపు కౌన్సిలర్లతోపాటు ఎక్స్ అఫిసియో సభ్యుల హోదాలో చీరాల ఎమ్మెల్యే కొండయ్య, ఎంపీ తేనేటి కృష్ణ ప్రసాద్ ఓట్లు వేశారు. తీర్మానం నెగ్గడానికి అవసరమైన దానికంటే మూడు ఓట్లు అదనంగా వచ్చాయి

# మచిలీపట్టణానికి ఆపరేషన్ సింధూర్ తో బంధం

**హైదరాబాద్ పెన్ పవర్:**
మన సైన్యం చూపిస్తున్న తెగువ, దూకుడు, ధైర్యం ప్రపంచ దేశాలను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. అయితే ఉగ్రవాద దేశంపై సాగుతున్న యుద్ధంలో భారత్ డ్రోన్లను కనివిని ఎరుగని రేంజ్ లో వాడింది. ఉగ్రవాద దేశం సైతం అదే స్థాయిలో మనమీదికి ప్రయోగిస్తే.. వాటిని బిఇఎల్ డెవలప్ చేసిన డి-4 వ్యవస్థ నేల కూల్చింది. వాస్తవానికి కొన్ని సంవత్సరాల క్రితం యుద్ధం అంటే విమానాలు ఎక్కువగా కనిపించేవి. ట్యాంకులు ఎక్కువగా దర్శనమిచ్చేవి. శతఘ్నులు, యుద్ధనౌకలు యుద్ధక్షేత్రంలో ఎక్కువగా కనిపించేవి.. అయితే ఉక్రెయిన్ %-% రష్యా మధ్య జరిగిన పోరు తర్వాత డ్రోన్ల వాడకం అధికమైపోయింది. ఇక ప్రస్తుతం ఉగ్రవాద దేశంతో మనం సాగిస్తున్న పోరులో డ్రోన్ల వాడకం కానీ విని ఎరుగనిస్థాయికి పెరిగిపోయింది.. అటు ఉగ్రవాద దేశం నుంచి కూడా డ్రోన్లు భారీగానే వస్తున్నాయి. ఇక ఎగిరే బాంబులకైతే లెక్కలేదు. ఇక ఇదే సమయంలో ఉగ్రవాద దేశం మన పైకి సంధిస్తున్న డ్రోన్లను తిప్పికొట్టే ఎయిర్ డిఫెన్స్ ను భారత్ డెవలప్ చేసుకుంది. ఉగ్రవాద దేశం చైనా మీద, తుర్కియే మీద విపరీతంగా డిపెండ్ అయింది. అక్కడినుంచి డ్రోన్స్ ఇంపోర్ట్ చేసుకుంది. అయితే వాటిని పడగొట్టడంలో మన డిఫెన్స్ అదరగొట్టింది. వీటిని నేల నాకించేలా చేయడంలో ఎస్ 400, ఆకాష్ వంటి మిసైల్స్ కీ రోల్ ప్లే చేశాయి. ఇక వీటితోపాటు భారత్ ఎలక్ట్రోనిక్స్ లిమిటెడ్ డెవలప్ చేసిన డీ4 వంటి వ్యవస్థ కూడా మేజర్ రోల్ ప్లే చేసింది. డీ 4 అంటే డ్రోన్, డిటెక్షన్, డెటర్, డెస్ట్రాయ్.. ఇందులో ప్రధానంగా రాడార్లు ఉంటాయి. లేజర్లు కూడా ఇమిడి ఉంటాయి. ఎలక్ట్రో ఆప్టికల్ వ్యవస్థలు ప్రధాన పాత్ర పోషిస్తుంటాయి. మన దేశానికి చెందిన డిఫెన్స్ రీసెర్చ్, డెవలప్ సెంటర్ వీటిని అభివృద్ధి చేసింది. అయితే ఎక్కువ సంఖ్యలో మ్యానుఫ్యాక్చర్ చేసే బాధ్యతను భారత్ ఎలక్ట్రోనిక్స్ లిమిటెడ్ (బిఇఎల్) భుజాలకు ఎత్తుకుంది. మ్యానుఫ్యాక్చరింగ్ స్టేజిలో బిఈఎల్ లోనే డ్రోన్లకు మళ్లీ ఫైనల్ టచింగ్ అందుతుంది. డి 4 వ్యవస్థలకు ఉపయోగపడే రాడార్లు బెంగళూరు యూనిట్ లో తయారవుతున్నాయి. జామర్లు హైదరాబాదులో రూపుదిద్దుకుంటున్నాయి. ఆ తర్వాత అవి ఆంధ్రప్రదేశ్ లోని మచిలీపట్నం వెళ్తున్నాయి. మచిలీపట్నం యూనిట్ ఎలక్ట్రో ఆప్టిక్ డివైస్ ను తయారు చేస్తోంది. వాటికి రాడార్లు, జామర్లు కస్టమర్ చేసి డీ 4 వ్యవస్థకు ఫైనల్ టచ్ ఇస్తోంది. మొత్తంగా ఆపరేషన్ సిందూర్ లో బందరు కూడా తనవంతు పాత్ర పోషించింది. ఇక్కడే అధునాతనమైన డీ4 వ్యవస్థ డెవలప్ అవుతోంది. "ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం గొప్ప విషయం. అయితే ఇందులో బందరు ప్రాంతానికి పాత్ర ఉండటం మరింత గర్వకారణం దీనిని గొప్పగా భావిస్తున్నామని" బందరు ప్రాంత ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

## ప్రెస్ క్లబ్ భవనం అప్పగించాలని వినతి

**జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ను కలిసిన ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యులు.**

**హైదరాబాద్ పెన్ పవర్:** అరకులోయ నూతనంగా ఎన్నికైన ఏపీడబ్ల్యూజెఎఫ్ అరకులోయ మండల కమిటీ సభ్యులు బుధవారం రాష్ట్ర జిసిసి ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ను పాడేరు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వినతి పత్రాన్ని అందజేశారు. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో నిర్మించిన అరకులోయ ప్రెస్ క్లబ్ భవనం ప్రారంభించి అప్పగించాలని కోరారు.ప్రెస్ క్లబ్ భవనం నిర్మించిన 10ఏళ్లు కావస్తున్న నేటి ప్రారంభించలేదని దీంతో ఆర్డబ్ల్యూఎస్,ఇంజనీరింగ్ అధికారులు భవనాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపారు.తమరు చొరవ తీసుకోని సమస్య పరిష్కరించి ప్రెస్ క్లబ్ భవనం అప్పగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు

## ప్రెస్ క్లబ్ భవనం అప్పగించాలని వినతి

**జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ను కలిసిన ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యులు.**

**హైదరాబాద్ పెన్ పవర్:**తనంగా ఎన్నికైన ఏపీడబ్ల్యూజెఎఫ్ అరకులోయ మండల కమిటీ సభ్యులు బుధవారం రాష్ట్ర జిసిసి ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ను పాడేరు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. నూతనంగా ఎన్నికైన మండల కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం వినతి పత్రాన్ని అందజేశారు. గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో నిర్మించిన అరకులోయ ప్రెస్ క్లబ్ భవనం ప్రారంభించి అప్పగించాలని కోరారు.ప్రెస్ క్లబ్ భవనం నిర్మించిన 10ఏళ్లు కావస్తున్న నేటి ప్రారంభించలేదని దీంతో ఆర్డబ్ల్యూఎస్,ఇంజనీరింగ్ అధికారులు భవనాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపారు.తమరు చొరవ తీసుకోని సమస్య పరిష్కరించి ప్రెస్ క్లబ్ భవనం అప్పగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.దీనిపై సానుకూలంగా స్పందించి ప్రెస్ క్లబ్ భవనాన్ని అప్పగించేలా చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యుజెఎఫ్ కార్యదర్శి వంతల డేవిడ్,మండల అధ్యక్షుడు బిమిడి త్రినాద్,సహాయ కార్యదర్శి రామునాయుడు, కోశాధికారి కె సింహాద్రి, ప్రధాన కార్యదర్శి కె సింహాచలం,కె రామన్న పాల్గొన్నారు.

## శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి నూతన డిప్యూటీ ఈవో నియామకం

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీ పద్మావతి అమ్మవారు ఆలయానికి నూతన డిప్యూటీవో బాధ్యతలు స్వీకరించారు టిటిడి లో భారీగా డిప్యూటీ ఈ.ఓ లను బదిలీలు చేసిన విషయం విదితమే.ఈ క్రమంలో తిరుచానూరు శ్రీ పద్మావతి నూతన డిప్యూటీ ఈవోగా పి హరిన్ద్రనాథ్ బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా హరిన్ద్రనాథ్ మాట్లాడుతూ శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి డిప్యూటీ ఈఓ గా బాధ్యతలు స్వీకరించడం చాలా సంతోషకరంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. శ్రీ పద్మావతి అమ్మవారి దయ వల్లే బాధ్యతలు చేపట్టగలిగానని అన్నారు. భక్తులు సంతృప్తికరమైన దర్శనం చేసుకోవడానికి తగిన విధంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఆగమ శాస్త్రనుసారం అమ్మవారికి కైంకర్యాలు జరిగే విధంగా చర్యలు చేపడతానని అన్నారు. కాగా నూతన డిప్యూటీ ఈవో గతంలో తిరుమల ఆర్ -2 లో తమ సేవలను అందించారు. ప్రస్తుతం ఉన్న డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ తన మాతృ శాఖ అయిన హెచ్ఆర్ సర్వీస్ లకు వెళ్ళారు

# సింధు నది ఎక్కడ పుట్టింది: ఎన్ని దేశాల గుండా ఈ నది ప్రవహిస్తుంది.?



**హైదరాబాద్ పెన్ పవర్:** సింధు నది టిబెట్లో ఉద్భవించి భారతదేశం పాకిస్తాన్ గుండా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తుంది. పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థకు ఇది ప్రధాన ఆధారం. ఈ నది పరీవాహక ప్రాంతాన్ని చైనా, భారత దేశం, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ పంచుకుంటాయి. సింధు నదిపై అనేక ఆనకట్టలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి.సింధు నది సముద్ర మట్టానికి దాదాపు 5,182 మీటర్ల ఎత్తులో టిబెట్లోని మానసరోవర్ సరస్సు సమీపంలోని సిన్-కా-బాబ్ ప్రవాహంలో ఉద్భవించి, ఇండియా గుండా ప్రవహించి, పాకిస్తాన్లోని కరాచీ నది సమీపంలో అరేబియా సముద్రంలో కలుస్తుంది.సింధు నది సముద్ర మట్టానికి దాదాపు 5,182 మీటర్ల ఎత్తులో టిబెట్లోని మానసరోవర్ సరస్సు సమీపంలోని సిన్-కా-బాబ్ ప్రవాహంలో ఉద్భవించి, ఇండియా గుండా ప్రవహించి, పాకిస్తాన్లోని కరాచీ నది సమీపంలో అరేబియా సముద్రంలో కలుస్తుంది.

ఆసియాలో అతి పొడవైన నదులలో ఒకటైన సింధు నదీ పరీవాహక ప్రాంతాన్ని చైనా, భారతదేశం, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ పంచుకుంటాయి. ఈ నదీ పరీవాహక ప్రాంతంలో 60 శాతం పాకిస్తాన్లో ఉంది. సింధు నది ఇక్కడి అనేక ప్రావిన్సులలో వ్యవసాయ, పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలకు మూలం. పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇచ్చే ఏకైక నది ఇదే కాబట్టి దీనిని పాకిస్తాన్ జీవనాధారంగా పిలుస్తారు.ఆసియాలో అతి పొడవైన నదులలో ఒకటైన సింధు నదీ పరీవాహక ప్రాంతాన్ని చైనా, భారతదేశం, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ పంచుకుంటాయి. ఈ నదీ పరీవాహక ప్రాంతంలో 60 శాతం పాకిస్తాన్లో ఉంది. సింధు నది ఇక్కడి అనేక ప్రావిన్సులలో వ్యవసాయ, పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలకు మూలం. పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇచ్చే ఏకైక నది ఇదే కాబట్టి దీనిని పాకిస్తాన్ జీవనాధారంగా పిలుస్తారు.

సింధు నది పొడవును పరిశీలిస్తే, ఈ నది వైశాల్యం దాదాపు 11,65,000 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. ఈ నది మొత్తం పొడవు 3,180 కి.మీ. జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్ అనే ఐదు నదులు సింధు నదికి ప్రధాన ఉపనదులు. పాకిస్తాన్ భూమిలో 92 శాతం శాశ్వత నీటిపారుదల వ్యవస్థ లేనందున సింధు నది పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థకు ఏకైక ఆధారం. సింధు నది పొడవును పరిశీలిస్తే, ఈ నది వైశాల్యం దాదాపు 11,65,000 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. ఈ నది మొత్తం పొడవు 3,180 కి.మీ. జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్ అనే ఐదు నదులు సింధు నదికి ప్రధాన ఉపనదులు. పాకిస్తాన్ భూమిలో 92 శాతం శాశ్వత నీటిపారుదల వ్యవస్థ లేనందున సింధు నది పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థకు ఏకైక ఆధారం.

దాదాపు 3,200 కిలోమీటర్ల పొడవున్న సింధు నది భారతదేశంలో దాదాపు 800 కిలోమీటర్లు మాత్రమే ప్రవహిస్తుంది. ఈ నది జమ్మూ కశ్మీర్, లడఖ్ గుండా ప్రవహిస్తుంది. అయితే, వాస్తవానికి, ఈ నదిలో ఒక చిన్న భాగం మాత్రమే భారత నియంత్రణలో ఉంది.

దాదాపు 3,200 కిలోమీటర్ల పొడవున్న సింధు నది భారతదేశంలో దాదాపు 800 కిలోమీటర్లు మాత్రమే ప్రవహిస్తుంది. ఈ నది జమ్మూ కశ్మీర్, లడఖ్ గుండా ప్రవహిస్తుంది. అయితే, వాస్తవానికి, ఈ నదిలో ఒక చిన్న భాగం మాత్రమే భారత నియంత్రణలో ఉంది.

సింధు నది దాని ఉపనదులపై అనేక ఆనకట్టలు నిర్మించారు. ఇందులో విద్యుత్తును ఉత్పత్తి చేసే అనేక పెద్ద ప్రాజెక్టులు ఉన్నాయి. భారతదేశంలో సట్లెజ్ నదిపై భాక్రా ఆనకట్ట, బియాస్ నదిపై పండో ఆనకట్ట, చీనాబ్ నదిపై బాగ్లిహార్, దుల్హస్తి ఆనకట్టలు, జీలం నదిపై ఉరి, కిషన్‌గంగా ప్రాజెక్టులు నిర్మించారు. పాకిస్తాన్లో సింధు నదిపై తుర్బెలా ఆనకట్ట, జీలం నదిపై మంగళ ఆనకట్ట, నీలం-జీలం ప్రాజెక్టు నిర్మించారు. ఈ ఆనకట్టలన్నీ ఇండియా, పాకిస్తాన్ విద్యుత్ ఉత్పత్తికి, నీటిపారుదల వ్యవస్థకు ఉపయోగపడుతున్నాయి.

సింధు నది దాని ఉపనదులపై అనేక ఆనకట్టలు నిర్మించారు. ఇందులో విద్యుత్తును ఉత్పత్తి చేసే అనేక పెద్ద ప్రాజెక్టులు ఉన్నాయి. భారతదేశంలో సట్లెజ్ నదిపై భాక్రా ఆనకట్ట, బియాస్ నదిపై పండో ఆనకట్ట, చీనాబ్ నదిపై బాగ్లిహార్, దుల్హస్తి ఆనకట్టలు, జీలం నదిపై ఉరి, కిషన్‌గంగా ప్రాజెక్టులు నిర్మించారు. పాకిస్తాన్లో సింధు నదిపై తుర్బెలా ఆనకట్ట, జీలం నదిపై మంగళ ఆనకట్ట, నీలం-జీలం ప్రాజెక్టు నిర్మించారు. ఈ ఆనకట్టలన్నీ ఇండియా, పాకిస్తాన్ విద్యుత్ ఉత్పత్తికి నీటిపారుదల వ్యవస్థకు ఉపయోగపడుతున్నాయి.. డిజె ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి హనుమంతు తెలిపారు.

# పాదదర్శకంగా కానిస్టేబుళ్ల బదిలీ: జిల్లా ఎస్పీ



**హైదరాబాద్ పెన్ పవర్:**సాధారణ బదిలీలలో భాగంగా వనపర్తి జిల్లాలో వివిధ పోలీస్టేషన్ల నందు పనిచేస్తూ 5 సంవత్సరాల సర్వీసును పూర్తి చేసుకున్న 29 మందికానిస్టేబుళ్లకు సోమవారం రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్. కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మీరు కోరుకున్న చోటుకు పోస్టింగ్ ఇచ్చాం అధికారుల అంచనాలకు అనుగుణంగా పనిచేయాలని అనుభవాన్ని ఉపయోగించి పోలీసు సేవలు ప్రజలకు అందించాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో వివిధ పోలీస్టేషన్ల నందు పని చేస్తూ సుదీర్ఘకాలం ప్రజలకు సేవలు అందించిన అనుభవం ఉన్నదని, కష్టమైన పరిస్థితుల్లో కూడా ఉద్యోగం నిర్వహించి కానిస్టేబుళ్ళు మీ యొక్క పూర్తిస్థాయి అనుభవాన్ని ఉపయోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, పోలీస్ స్టేషన్లో స్టేషన్ హౌస్ అధికారి గారికి, జూనియర్స్ కు, తోటి సిబ్బందికి పనిలో సలహాలు ఇస్తూ ఆదర్శంగా ఉండాలని తెలిపారు. స్టేషన్ పరిధిలో జరిగే అసాంఘిక ,సంఘ వ్యతిరేక కార్యకలాపాలు గుర్తించి నిరోధించడంలో కృషి చేయడంలో ముందుండాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగికి బదిలీలు సాదారణం అని అన్నారు. మంచి ఆహర అలవాట్లు కలిగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి, సమయం దొరికినప్పుడు వ్యాయామం చేయడం, యోగ చేయడం లాంటి అలవాట్లను అలవర్చుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి, ఉమామహేశ్వరరావు, వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు,, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్, నరేష్, సూపరింటెంట్, ఇంతియాజ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

# జనసేన కార్యకర్తకు టీడీపీ ఎమ్మెల్యే అండ

**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన పార్టీ కార్యకర్తకు కష్టం వస్తే.. టీడీపీ ఎమ్మెల్యే అండగా నిలబడ్డారు.. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి మరీ సాయం కోరారు. స్వయంగా ఎమ్మెల్యే వచ్చి రిక్వెస్ట్ చేయడంతో సీఎం కూడా వెంటనే సాయం అందించారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త రమేష్ భార్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమె వైద్యం కోసం చాలా డబ్బులు ఖర్చు చేశారు.. అయితే వైద్యులు ఆమెకు కిడ్నీ మార్చిడి చేయాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులతో వారికి ఆ సర్జరీ భారంగా మారింది. వెంటనే స్థానిక జనసేన పార్టీ నేతలు ఈ విషయాన్ని గోపాలపురం టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు.. ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సాయం అందేలా చూశారు. గోపాలపురం నియోజకవర్గానికి చెందిన ఒక సామాన్యమైన పేద కుటుంబానికి చెందిన ఉన్నమట్ల రమేష్‌కు జనసేన పార్టీపై అభిమానం. గత ఎన్నికల్లో కూటమి గెలుపు కోసం పనిచేశారు. అయితే కొంతకాలంగా రమేష్ భార్యకు కిడ్నీ సమస్య వలన.. వైద్యులు కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేయాలని సూచించారు. రెక్కాడితే గానీ, డొక్కాడని కుటుంబం ఆపరేషన్ కు అన్ని లక్షలు వెచ్చించి వైద్యం చేయించుకోలేని పరిస్థితి. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు, జనసేన నేతలు, కార్యకర్తలు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు గారి దృష్టికి తీసుకువెళ్లి ఆదుకోవాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి నుండి సహాయం అందేలా చూస్తానన్నారు. వీరు %ాూజ%కి అప్లై చేసుకోగా రూ.2,00,000 లక్షలు మంజూరు చేశారు. కానీ రమేష్ భార్య ఆపరేషన్‌కు ఆ డబ్బులు సరిపోలేదుఆ వెంటనే ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు స్వయంగా సీఎంఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడగా.. వారు రూ. 3,60,000 మంజూరు చఏశారు. కానీ నిరుపేద కుటుంబం ఇప్పటికే వైద్య ఖర్చుల నిమిత్తం అంత అయ్యిపోయింది ఆర్థికంగా చితికిపోయారు. తమ దగ్గర ఆపరేషన్‌కు సరిపడా డబ్బులు లేవని.. మళ్లీ ఎమ్మెల్యేను కలిసి సాయం కోరారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు జనసేన పార్టీ కార్యకర్త రమేష్ కుటుంబానికి అండగా నిలిచి.. ఆయనే స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి రూ. 6,30,000/- లక్షలు చెక్కును మంజూరు చేయించి.. ఇంకా ఆపరేషన్ కి అవసరమైతే సొంత డబ్బును కూడా ఇస్తా అని హామీ ఇచ్చారు. మద్దిపాటు వెంకట రాజు చేసిన సాయం గురించి టీడీపీ కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా షేర్ చేయడంతో వైరల్ అవుతోంది. గోపాలపురం ఎమ్మెల్యే పెద్ద మనసును అందరూ అభినందిస్తున్నారు.

# మే చివరలో రైతు భరోసా

**హైదరాబాద్ పెన్ పవర్:**
తెలంగాణలోని రేవంత్ సర్కార్ రైతులకు శు భవార్త చెప్పింది. అన్నదాతలు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తోన్న రైతు భరోసాకు సంబంధించి రేవంత్ సర్కార్ కీలక ప్రకటన చేసింది. నాలుగెకరాలు, ఆపై భూమి ఉన్న రైతులకు ఇంకా రైతు భరోసా అందలేదు. నిధులు ఎప్పుడు విడుదలవుతాయో తెలియక.. అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో రేవంత్ సర్కార్ వారికి శుభవార్త చెప్పింది. రబీ సీజన్‌కు సంబంధించి నాలుగు నుంచి 10 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు మే చివరి వారంలోగా రైతు భరోసా నిధులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖను ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. వచ్చేవారంలో రైతు భరోసాపై ముఖ్యమంత్రి రేవంత్ సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తుంది. అనంతరం రైతు భరోసా చెల్లింపుల ప్రక్రియపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.ఇక రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రబీ సీజన్‌కు సంబంధించి రైతు భరోసా కార్యక్రమాన్ని అమలు చేసింది. మొదటి దశలో భాగంగా రైతుల అకౌంట్లలోకి నిధులను జమ చేశారు. రెండో దశలో ఫిబ్రవరి 5న, మూడో దశలో ఫిబ్రవరి 11న రైతు భరోసా నిధులు విడుదల చేశారు. మొదటి మూడు దశల్లో.. నాలుగు ఎకరాల వరకు భూమి కలిగిన రైతుల ఖాతాల్లో మాత్రమే డబ్బులు జమ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. నాలుగెకరాలు ఆపై ఉన్న వారికి రైతు భరోసా నిధులు ఇంకా అందలేదు.ఈ క్రమంలో వారందరికి రైతు భరోసా నిధులు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. అయితే, వీటిని కూడా దశలవారీగా రైతుల ఖాతాల్లో జమ చేయాలని సర్కార్ భావిస్తున్నట్లు సమాచారం.ఇప్పటి వరకు నాలుగెకరాలలోపు రైతులందరికి రైతు భరోసా నిధులు జమయినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రస్తుతం రాష్ట్రంలో నాలుగు ఎకరాలకిపైగా భూమి కలిగిన రైతులు దాదాపు 35లక్షల మంది ఉన్నారు. రబీ సీజన్‌కు సంబంధించిన వారంతా రైతు భరోసా నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. మే చివరి నాటికి వారి ఖాతాల్లో ఈ నిధులు జమ చేయనున్నట్లు తెలుస్తోంది.ఇక ఈ ఏడాదికి సంబంధించి.. ఖరీఫ్ సీజన్ జూన్లో ప్రారంభంకానుంది. ఈ క్రమంలో ప్రభుత్వం.. జూన్ నెల వరకు రబీ సీజన్‌కు సంబంధించిన చెల్లింపులు పూర్తి చేయాలని భావిస్తోంది. ఆ తరువాత జూలై నుంచి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధుల చెల్లింపు ప్రక్రియను ప్రారంభించాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఈ అంశంపై నిర్ణయం తీసుకునేందుకు త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమావేశం కానున్నారు. ఆ తర్వాత దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# పేదల గుడిసెలు కూల్చేస్తారా...

**హైదరాబాద్ పెన్ పవర్:**
మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ వరంగల్, ములుగు జిల్లాల పర్యటనకు రానున్నారని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన చర్యలు ప్రజాగ్రహానికి గురిచేస్తున్నాయి. ప్రతిపక్ష బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుల్డోజర్ కంపెనీలతో రహస్య ఒప్పందం ఉందా? అని రాహుల్ గాంధీని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.రోజువారీ కూలి పనులు చేసుకుని జీవించే నిరుపేద ప్రజల ఇండ్లతో పాటు వారి జీవనోపాధిని నాశనం చేయడానికి నిరంతర ప్రయత్నం చేయడానికి కారణం ఏంటి ? వరంగల్‌లో కూల్చివేతలు ఎందుకు జరుగుతున్నాయని రాహుల్‌ను కేటీఆర్ ప్రశ్నించారు. ఈరోజు మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించే మార్గాన్ని 'అందం'గా చేయడానికి అని ప్రజలకు చెబుతున్నారు. అలాంటి చర్యలు చేస్తున్న మీ కాంగ్రెస్ నేతలు మీది ప్రజా పాలన అని, ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడానికి సిగ్గుపడాలంటూ ఘాటుగా స్పందించారు. రాజభవనాలలో విలాసవంతమైన విందులు, మరోవైపు 200 కోట్ల రూపాయలకు పైగా ప్రజా ధనాన్ని వృథా ఖర్చు చేశారు. బుల్డోజర్లతో పేదల ఇండ్లు కూల్చివేస్తున్నారు. పేదల జీవితాలను బుల్డోజర్ల కింద ఎందుకు నలిపేయాల్సి వచ్చింది?. మీ సిగ్గులేని కాంగ్రెస్ ప్రభుత్వం మేం అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కేటీఆర్ షేర్ చేసిన వీడియోలో ఏముందంటే.. రోడ్డు పక్కన ఉన్న పేదల గుడిసెలు, వారి చిన్న చిన్న షాపులను సిబ్బంది తొలగిస్తున్నారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ లో పాల్గొనే అందెగత్తెలు నేడు వరంగల్ జిల్లాకు రానున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వెయ్యి స్తంభాల గుడి, రామప్ప టెంపుల్ లాంటి ప్రముఖ కట్టడాలను వారు సందర్శించనున్నారు. దాంతో తమ లాంటి పేదలకు నష్టం కలిగించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నిస్తున్నారు. వారెవరో విదేశాల నుంచి అందగత్తెలు వస్తే మాకు అన్యాయం ఎందుకు చేస్తున్నారు.

# కింగ్ కు దక్కని మర్యాద

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో మిస్ వలర్డ్ 2025 పోటీలు గ్రాండ్ గా జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రారంభమైన ఈవెంట్‌లో రోజుకో కార్యక్రమం జరుగుతోంది. అందాల పోటీలకు విచ్చేసిన వివిధ దేశాల భామలు చార్మినార్‌ను సందర్శించిన అనంతరం చౌమహల్లా ప్యాలెస్‌లో నిర్వహించిన విందుకు హాజరయ్యారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణులకు ఇచ్చిన డిన్నర్‌కు రేవంత్ రెడ్డి తన సతీమణి గీతతో కలిసి హాజరయ్యారు. వారితోపాటు హీరో అక్కినేని నాగార్జున కూడా వచ్చారు.టేబుల్ వద్దకు చేరుకున్న వీరు పరస్పరం పలకరించుకోలేదు. నాగార్జున నమస్కరిస్తూ షేక్ హ్యాండ్ ఇవ్వబోగా రేవంత్ రెడ్డి స్పందించలేదు. పక్కనే ఉన్న అతడి సతీమణి గీత పలకరించారు. నాగార్జునతో పలకరించకుండా అక్కడకు హాజరైన మిగతా వారితో రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఆ తర్వాత కొన్ని నిమిషాల పాటు రేవంత్, నాగార్జున ఒకే టేబుల్ వద్ద కూర్చున్నా కూడా పరస్పరం పలకరించుకోలేదు. అతడు పలకరించకపోవడంతో నాగార్జున ఇటు తిరిగి కూర్చున్నారు. కార్యక్రమం ఆసాంతం వీక్షించారు. ఈ వ్యవహారమంతా కెమెరా కంటికి చిక్కింది. ఆ వీడియో వైరల్‌గా మారింది.ఈ స్థాయిలో వివాదం కావడం వెనుక కొన్ని నెలల కిందట జరిగిన పరిణామాలు కారణంగా తెలుస్తున్నాయి. నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను గతంలో హైడ్రా కూల్చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత నాగార్జున కుమారుడు హీరో నాగచైతన్య విడాకుల అంశంలో కొండా సురేఖ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా సంచలనం రేపాయి. వరుస పరిణామాలతో నాగార్జున కుటుంబం రేవంత్ రెడ్డిపై ఆగ్రహంతో ఉందని తెలుస్తోంది. గతంలో కూడా రేవంత్ రెడ్డి, నాగార్జున ఎదురుపడినా ఇదే సీన్ కనిపించింది. సినీ ప్రముఖులతో భేటీ సందర్భంగా నాగార్జున పాల్గొన్నా రేవంత్‌రెడ్డి పట్టించుకోలేదు. రేవంత్ రెడ్డి తీరు చూస్తుంటే సినీ పరిశ్రమతో సఖ్యత ఉండడం లేదని తెలుస్తోంది. తనకు వ్యతిరేకంగా వెళ్లే వారిని పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. అందులో భాగంగానే పాన్ ఇండియా స్టార్‌ను ఒక రోజు జైలుకు పంపించిన వైనాన్ని గుర్తుచేసుకుంటున్నారు. సినీ పరిశ్రమతో ప్రభుత్వ వైరం సరికాదని పలువురు చెబుతున్నారు.

# ఫడ్నవిస్ ను కలిసిన రోహిత్

**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కలిశాడు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత రోహిత్ ఇలా మహారాష్ట్ర సీఎంను కలవడంపై రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కొంపదీసి హిట్‌మ్యాన్ బీజేపీలో చేరి పొలిటికల్ ఎంట్రీ ఇవ్వడం లేదు కదా అంటూ నెటిజన్లు పోస్టులు చేస్తున్నారు.ముంబైలోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను రోహిత్ శర్మ బుధవారం కలుసుకున్నాడు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, రోహిత్ శర్మ కాసేపు భేటీ అయ్యారు. దీనికి సంబంధించిన ఫొటోలను సీఎం ఫడ్నవీస్ నేరుగా సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దాంతో పాటు రోహిత్ శర్మ నూతన అధ్యాయంలో విజయం సాధించాలని కోరుకుంటున్నా అంటూ పేర్కొన్నారు"నా అధికారిక నివాసమైన వర్షలో రోహిత్ శర్మను కలుసుకోవడం, మాట్లాడటం చాలా సంతోషాన్ని ఇచ్చింది. టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ పలికిన సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపాను. తన నూతన అధ్యాయంలో సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను" అని సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.రిటైర్మెంట్ తర్వాత రోహిత్ శర్మ ఇలా మహారాష్ట్ర సీఎంను కలవడం పలు ఊహాగానాలకు దారి తీస్తోంది. కెరీర్‌కు గుడ్ బై చెప్పిన తర్వాత ఎంతోమంది క్రికెటర్లు రాజకీయాల్లో చేరారు. ప్రస్తుత టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా బీజేపీలో చేరి ఎంపీగా గెలిచాడు. ఆ బాటలోనే ఇప్పుడు రోహిత్ శర్మ వెళ్తున్నాడని అనుకుంటున్నారు. కానీ రోహిత్ శర్మ టీ20, టెస్టులకు మాత్రమే రిటైర్మెంట్ ఇవ్వగా.. వన్డే క్రికెట్‌లో ఇంకా కొనసాగుతున్నాడు. 2013లో టెస్టు క్రికెట్‌లో అడుగుపెట్టిన రోహిత్ శర్మ 2025 వరకూ కొనసాగాడు. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు కొద్ది రోజుల ముందే తన రిటైర్మెంట్‌ను ప్రకటించాడు. ఓవరాల్‌గా టీమిండియా తరఫున 67 టెస్టు మ్యాచ్‌లు ఆడిన హిట్ మ్యాన్ 4301 పరుగులు చేశాడు. 40.57 యావరేజ్‌తో 12 సెంచరీలు, 18 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు.

## రాష్ట్ర గవర్నర్ దత్తత గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు



హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్రగవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత తీసుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని పుసుకుంట. గోగులపూడి గ్రామాలు. ఆదిలాబాద్ జిల్లాలోని బు రుగు.. మంగ్లీ. మరియు నాగర్ కర్నూల్ జిల్లా లోని అప్పాపూర్. బౌరాపూర్. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు తెలియజేశారు. రాష్ట్రంలో గత 10 ఏండ్లుగా నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో తీసుకువచ్చిన భూభారతి చట్టానికి గత నెల 17వ తేదీ నుంచి రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ప్రారంభించి ప్రయోగాత్మకంగా అమలు చేశామని ఎలాంటి రుసుములు లేకుండా ప్రజల నుంచి దరఖాస్తులను. స్వీకరించి సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం పని చేస్తుందని తెలియజేశారు. చిత్రంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ. గృహ నిర్మాణ శాఖ. సమాచార పౌర సంబంధాల శాఖ. స్టాంపు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండి పి వి గౌతమ్. తదితరులు ఉన్నారు..

## ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ను మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి కొటికలపూడి గ్రామ నూతన కార్యవర్గం

హైదరాబాద్ పెన్ పవర్:మైలవరం నియోజకవర్గం ఇబ్రహీంపట్నం మండలంలోని కొటికలపూడి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా ఎంపికైన అర్జా సుధాకర్ సుధాకర్ తోపాటు, నూతనంగా ఎంపికైన పార్టీ నూతన కార్యవర్గ సభ్యులు కేశినేని శివనాథ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో బుధవారం ఎంపి కేశినేని శివనాథ్ ను కలిసి గ్రామ పార్టీలో నూతన కార్యవర్గ సభ్యులుగా తమకి అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి కేశినేని శివనాథ్ కొటికలపూడి గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన అజ్జా సుధాకర్ కు అభినందనలు తెలపటంతో పాటు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన కొలకాని తిరుపతి రావు, సెక్రటరీ గంర్లాల కిషోర్ తోపాటు ఇతర కార్యవర్గ సభ్యులకి ఎంపి కేశినేని శివనాథ్ అభినందనలు తెలిపారు.
ఈకార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ మల్లేటి రామారావు, వైస్ ఎంపీపీ బండి వెంకటేశ్వరరావు, టిడిపి గ్రామ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, వీర్ల వెంకయ్య, శ్రీనివాసరావులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అగ్గిపెట్టలో పట్టు చీర..దుర్గమ్మకు సమర్పణ

హైదరాబాద్ పెన్ పవర్:బుధవారం నాడు రోజు ఉదయం శ్రీ కనక దుర్గమ్మ వారికి చేనేత కార్మికులైన భక్తులు అగ్గిపెట్టె లో పట్టు చీర సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం సిరిసిల్ల వాస్తవ్యుడైన చేనేత కళాకారుడు నల్ల విజయ్ కుమార్, తండ్రి నల్ల పరంధాములు వారసత్వానికి పునికి పుచ్చుకొని చేనేత కళారంగంలో అగ్గిపెట్టెలో చీర మరియు శాలువను, కుట్టు లేకుండా లాల్చి పైజామా మరియు జాతీయ జెండాను అంతేకాకుండా మూడు కొంగుల చీరను మరియు ఊసరవెల్లిలా రంగులు మార్చే చీర మరియు సుగంధ ద్రవ్యాల సువాసన వచ్చే చీర, దబ్బనంలో దూరిపోయే చీర, బంగారం, వెండి చీరలు రూపొందించిన అద్భుతమైన కళాకారుడు.

# త్వరలో కేసీఆర్ సీఎం...

హైదరాబాద్ పెన్ పవర్:
త్వరలో మా పార్టీ వారు ముఖ్యమంత్రి అవుతారని అవుతారని ఎవరైనా చెప్పుకుంటారు. కానీ పక్క పార్టీ వాళ్ల సీఎం అవుతారని చెప్పడం కష్టం. తెలంగాణ బీజేపీ నేతలు మాత్రం అలాంటి ప్రకటనలు చేస్తూంటారు. త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పార్టీ ఆఫీసులో ప్రెస్ మీట్ పెట్టి ప్రకటించారు. త్వరలో బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ లో విలీనం అవుతుందని.. రేవంత్ ను తప్పించి.. సీఎంగా కేసీఆర్ ను నియమిస్తారని ఆయన జోస్యం చెప్పారు. ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తనకు ఉన్న సమాచారం ఏమిటో కూడా చెప్పారు. మంగళవారం బీఆర్ఎస్ ముఖ్య నేత హరీష్ రావు ప్రెస్ మీట్ లో కొన్ని విషయాలపై ప్రత్యేకంగా మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విబేధాలు లేవన్నారు. కేసీఆర్ మాటే తన బాట అని స్పష్టం చేశారు. కేటీఆర్ కు పార్టీ నాయకత్వ పగ్గాలు అప్పగించినా తాను స్వాగతిస్తానని చెప్పారు. హరీష్ రావు సొంత పార్టీ పెట్టబోతున్నారని లేకపోతే పార్టీ మారుతారని ఇటీవల ప్రచారం జరుగుతూండటంతో ఆయ న ఈ వివరణ ఇచ్చారు. ఇలా వివరణ ఇవ్వడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య డీల్ కుదిరిందని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కు అనిపించింది. అందుకే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రెస్ మీట్ పెట్టి కాంగ్రెస్ లో బీఆర్ఎస్ విలీనం ముహుర్తం ఖరారు అయిందని స్టేట్ మెంట్ ఇచ్చారు. జూన్ రెండో తేదీన లేదా డిసెంబర్ లో విలీనం ఉంటుందని



తర్వాత కేసీఆర్ సీఎంగా ప్రమాణం చేస్తారన్నారు. రేవంత్ రెడ్డి మార్పు ఖాయమని చెప్పుకొచ్చారు బీజేపీ నేతల మాటల్లో లాజిక్ ఉన్నా లేకపోయినా ఈ విలీనం అనే మాట కాస్త నమ్మశక్యంగా లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనం చేసే ఆలోచన ఉన్నట్లయితే .. ఇటీవల భారీగా ఖర్చు పెట్టుకుని రజతోత్సవ వేడుకలు నిర్వహించాల్సిన అవసరం ఉండేది కాదని అంటున్నారు. ఇప్పటికిప్పుడు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్ ఉందని కూడా అనుకోలేరని.. ఇలాంటి సమయంలో పార్టీని విలీనం చేస్తారని బీజేపీ నేతలు ఎలా అనుకుంటారన్న ప్రశ్నలు వస్తున్నాయి.మరో వైపు కాంగ్రెస్ పార్టీ నేతలు ఏమైనా బీఆర్ఎస్ విలీనం అంటూ జరిగితే అది బీజేపీలోనేనని అంటున్నారు. అందుకే ఇప్పుడు వారు బీజేపీపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని చెబుతున్నారు. అయితే బీఆర్ఎస్ పార్టీ నేతలు మాత్రం రెండు జాతీయ పార్టీలకు కాలం చెల్లిందని.. తెలంగాణలో తెలంగాణ పార్టీ తప్ప మరో దానికి చోటు లేదని అంటున్నారు. అయితే మైండ్ గేమ్‌లను మాత్రం జోరుగా చేసుకుంటున్నారు.

# టైగర్ ను బంధించిన అటవీ సిబ్బంది

హైదరాబాద్ పెన్ పవర్:
కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దులో ఉన్న మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో పులి వరుస దాడులు గిరిజనులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. వేసవిలో తునికా ఆకులు సేకరించడానికి అడవులకు వెళ్లే కార్మికులపై పెద్ద పులులు దాడి చేసి దాడి చేస్తున్నాయి. గిరిజనులు తునికా ఆకులు సేకరించడానికి అడవిలోకి వెళ్లగా రెండు రోజుల్లో పులి నలుగురిని చంపింది. అదే పులి ఇటీవల సోమవారం మరో మహిళ ప్రాణాలు తీసింది. దాంతో అటవీ అధికారులు మరింత అప్రమత్తమై పులి కోసం అన్వేషించి సక్సెస్ అయ్యారు. గత నాలుగైదు రోజులుగా తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రజలను ముప్పుతిప్పలు పెట్టిన పులిని ఎట్టకేలకు బంధించారు. దోంగర్గావ్ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు పులిని బంధించారని సమాచారం.కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సరిహద్దులో ఉన్న మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా మూల్ తాలూకాలోని బదురానానికి చెందిన భూమికా బెండర్ (28) సోమవారం ఉదయం తన భర్త ఉదయ్, ఆమె తల్లిదండ్రులు, గ్రామస్తులతో కలిసి తునికా ఆకులు సేకరించడానికి సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్ళింది. ఆకులు సేకరిస్తుండగా, ఒక పెద్ద పులి అకస్మాత్తుగా ఆమెపై దాడి చేయగా... ఆమె కేకలు వేయడంతో, మిగతవారు వెంటనే అప్రమత్తమై అక్కడినుంచి పారిపోయారు. కానీ పులి దాడిలో ఆమె చనిపోయింది. చుట్టుపక్కల వారు గట్టిగా అరవడంతో పులి అడవిలోకి
వెళ్లిపోయింది. భూమికా మరణించిన తర్వాత, కుటుంబ సభ్యులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మూల్ పట్టణంలోని ఆసుపత్రికి తరలించారు.ఈ నెల 10వ తేదీన, చంద్రపూర్ జిల్లాలోని సింహావా తాలూకాలోని మెండమాల గ్రామానికి చెందిన కూలీలు తునికాను సేకరించడానికి వెళ్లారు. సాయంత్రం వరకు వారు ఇంటికి తిరిగి రాకపోవడంతో, వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వారి ఆచూకీ కోసం వెతికారు. అయితే, కాంత చౌదరి (65), రేఖాసిండే (51), శుభంగి చౌదరి (28) అనే ముగ్గురు కూలీల మృతదేహాలను అటవీ సిబ్బంది చార్గావ్ అటవీ ప్రాంతంలోని చెరువు సమీపంలో గుర్తించారు. మే 11న మూల్ తాలూకాలోని నాగోడ గ్రామానికి చెందిన విమలా షిండే (64) అనే మహిళ తునికా సేకరించడానికి వెళ్లి పులి దాడిలో చనిపోయింది. 4 రోజుల్లో ఐదుగురు తునికా కూలీలు చనిపోవడంతో తెలంగాణ సరిహద్దు అటవీ శివార్లలో,
మహారాష్ట్రలోని చంద్రపూర్, బల్లార్ష జిల్లాల్లో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వేసవి కాలంలో ఆదాయం తెచ్చిపెట్టే తునికా సేకరణను మహారాష్ట్ర అటవీ శాఖ నిలిపివేసింది. చంద్రాపూర్, బల్లార్ష సరిహద్దుల్లో పులుల దాడుల కారణంగా కొన్ని రోజులుగా తునికా సేకరణను నిలిపివేశారు. ఎవర అటవీ ప్రాంతాలకు వెళ్లవద్దని కూలీలను కోరినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. పులుల వరుస దాడులతో ఏ వైపు దాడి చేస్తుందోనని.. సరిహద్దు అటవీ ప్రాంతాల్లోని గిరిజనులు భయంతో గడుపుతున్నారు. పులి ఎక్కడ తమ ప్రాంతంలోకి ప్రవేశిస్తుందేమోనని సరిహద్దులోని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రజలు బిక్కుమిక్కుమంటూ గడిపారు.